నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I | హైదరాబాద్, శుక్రవారం 23 మే 2025 | SIDDIPET

## గజ్వేల్ జిల్లా దవాఖాన ఎంపిక


గజ్వేల్ జిల్లా దవాఖానను సందర్శించిన ఇంజినీరింగ్ అధికారులు

గజ్వేల్, మే 22: గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వ దవాఖానను గురువారం టీజీఎంఐడీసీ ఇంజినీరింగ్ అధికారుల బృందం సందర్శించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ.. దవాఖానకు తెలంగాణ వైద్యవిధాన పరిషత్ బ్రాండింగ్ పథకానికి దవాఖాన ఎంపికైందన్నారు. దవాఖానలో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు, సుందరీకరణ, ఆధునీకరణ పనులు, పార్కింగ్, ఓపీ, ఐపీ, బ్యూటిఫికేషన్, ఫైర్‌సేఫ్టీ, గార్డెనింగ్ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన నివేదికను టీవీవీపీ కమిషనర్‌కు అందజేస్తారన్నారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు పనులు చేపడుతామన్నారు. దవాఖాన అసిస్టెంట్ డైరెక్టర్ జయశ్రీ, ఆర్‌ఎంవో రాము తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల నకాషీ మాస్క్‌లకు అందగత్తెలు ఫిదా


శిల్పారామంలో మాస్క్‌లు పరిశీలిస్తున్న అందగత్తెలు

చేర్యాల, మే 22 : మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పారామంలో చేర్యాల నకాషీ చిత్రకారులు తయారు చేసిన మాస్క్‌లను చూసి మిస్ వరల్డ్ పోటీదారులు అబ్బురపడ్డారు. చే ర్యాల చిత్రకారులు పి.మల్లేశం, మంగ మౌనిక, అఖిల మిస్‌వరల్డ్ పోటీదారులకు వాటిని చూపించారు. శిల్పారామంలోని చేర్యాల నకాషీ చిత్రాల ప్రదర్శన వద్దకు దేశవిదేశాలను నుంచి వచ్చిన పోటీదారులు వాటిని ఏ విధంగా తయారు చేస్తున్నారో తెలుసుకోవడంతో పాటు మాస్క్‌లు తదితర చిత్రాలను కొనుగోలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నకాషీ చిత్రకారులను అందాల భామలు అభినందించారు.


సిద్దిపేట మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన వడ్లు ఆరబెట్టిన రైతులు


శ్రీగిరిపల్లిలో వర్షం నీళ్ల నుంచి ధాన్యం తీసి చూపిస్తున్న రైతు మాదగారి నర్సింహులు

# అన్నదాతకు ఎంతకష్టం

- మూడు రోజులుగా అకాల వర్షం
- ఈదురుగాలుల బీభత్సం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- మార్కెట్ యార్డుల్లో వర్షం నీటికి కొట్టుకుపోయిన వడ్లు
- అన్నదాతల గోసపట్టని మంత్రులు
- భరోసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం


సిద్దిపేట మార్కెట్‌లో ధాన్యం తడవకుండా ట్రాక్టర్‌లో తరలిస్తున్న రైతు కుటుంబం

సిద్దిపేట, మే 22( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో మూడు రోజులుగా ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో ధాన్యం తడిసి రైతులు నష్టపోయారు. మామిడి తోటల్లో కాయలు నేల రాలాయి. పలుచోట్ల చెట్లు విరిగాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు తడిసిపోయాయి. వర్షం నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులకు నష్టం జరిగింది. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులను కలిసి వారి బాధలు తెలుసుకున్న పాపాన పోలేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం రైతులను ఓదార్చడం లేదు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చంటి క్రాంతికిరణ్, ఇతర ముఖ్య నాయకులు పర్యటనలు చేసి రైతులకు ధైర్యం కల్పించారు.

### మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు...

ఉమ్మడి మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లు చేయాలని రైతులు రోడ్డెక్కుతున్నారు. పది రోజులు అయితే వానకాలం సాగు పనులు ప్రారంభమవుతాయి. రోజుల తరబడి ధాన్యం కేంద్రాల్లోనే రైతులు ఉండాల్సి వస్తుండడంతో వానకాలం దుక్కులు సిద్ధం చేసుకునే పనులు చేసుకోలేక పోతున్నారు.

### సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. వీటిలో ఇప్పటి వరకు 28 కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేసి మూసి వేశారు. దొడ్డు రకం వడ్లు ఇప్పటి వరకు 2,93,507 మెట్రిక్ టన్నులు 64,712 మంది రైతుల నుంచి కొన్నారు. రూ.540 కోట్లు రైతులకు చెల్లించారు. ఇంకా రూ. 140 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. సన్న రకం వడ్లు 6,386 మెట్రిక్ టన్నులు ఉంది. 1,063 రైతుల నుంచి కొనుగోలు చేశారు. రూ. 9.22 కోట్లు చెల్లించారు. మరో రూ. 5.60 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది.

### మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో 92 కేంద్రాల ద్వారా 43019 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం 10,295 మంది రైతుల నుంచి కొన్నారు. ఇప్పటి వరకు రూ. 76.33 కోట్లు 5,664 మంది రైతులకు చెల్లించారు. 4,631 మంది రైతులకు రూ. 23.47 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. దొడ్డు రకం వడ్ల కొనుగోలుకు 406 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఇప్పటి వరకు 120 సెంటర్లు మూసివేశారు. 2,02,350 మెట్రిక్ టన్నుల ధాన్యం 47,935 మంది రైతుల వద్ద కొన్నారు. రూ. 312 కోట్లు 35,415 మంది రైతులకు చెల్లించారు. మరో రూ. 157 కోట్లు చెల్లించాల్సి ఉంది.

### సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో 1,00,393 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం కొన్నారు. దీంట్లో 73,965 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి 14,005 మంది రైతులకు రూ. 171. 60 కోట్లు చెల్లించారు. సన్నరకం ధాన్యం 4,851 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. దీని విలువ రూ. 2.43 కోట్లు, 529 మంది రైతులకు రూ. 1.72 కోట్లు చెల్లించారు.


వర్షానికి శ్రీగిరిపల్లి కొనుగోలు కేంద్రంలోని పరిస్థితి


ముత్రాజ్‌పల్లి సమీపంలో నేలకొరిగిన వరి

# నిధులేవి..అభివృద్ధి జాడేది..!


- సీఎం రేవంత్... సంగారెడ్డి జిల్లా ప్రజల గోడు ఆలకిస్తారా
- కాంగ్రెస్ ప్రభుత్వంలో కుంటుపడిన జిల్లా అభివృద్ధి
- జిల్లాకు నిధులు కేటాయించని ప్రభుత్వం
- కేసీఆర్ ఇచ్చిన ఎస్‌డీఎఫ్ నిధుల విడుదలకు ససేమిరా
- సంగమేశ్వర,బసవేశ్వర ప్రాజెక్టులను అటకెక్కించిన సర్కారు
- జాడలేని మెట్రోరైలు విస్తరణ, కొత్త పరిశ్రమల స్థాపన
- పటాన్‌చెరు 250 పడకల దవాఖానకు నిధుల కొరత
- రైతుబంధు, పంట రుణమాఫీకి రైతుల ఎదురుచూపులు
- ప్రభుత్వం తీరుపై ప్రజల్లో పెల్లుబికుతున్న ఆగ్రహం
- ప్రభుత్వంపై సొంత పార్టీ నేతల్లోనే తీవ్ర అసంతృప్తి
- నేడు సీఎం రేవంత్ సంగారెడ్డి జిల్లా తొలి పర్యటన


జహీరాబాద్ : సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేసిన రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి

సంగారెడ్డి, మే 22(నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంగారెడ్డి జిల్లాను అభివృద్ధి బాటలో నడిపిస్తాను..నన్ను చూసి ఎమ్మెల్యేలకు ఓటువేసి గెలిపించండి. జిల్లా అభివృద్ధికి బాటలు వేయడంతో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాను'.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి సీఎం పగ్గాలు చేపడితే జిల్లా దశాదిశ మారుతుందని ప్రజలు నమ్మారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా జిల్లాలో అభివృద్ధి అటకెక్కింది. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలుకు నోచుకోవడం లేదు. రేవంత్ సర్కార్ సంగారెడ్డి జిల్లాపై శీతకన్ను వేసింది. జిల్లా అభివృద్ధి నిధుల జాడలేదు. కొత్త ప్రాజెక్టులు, కొత్త పరిశ్రమలు రాలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, 600కుపైగా పంచాయతీల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నిధులు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఎస్‌డీఎఫ్ నిధులు పూర్తిగా నిలిపివేసింది. జిల్లాను సస్యశ్యామలం చేసేలా కేసీఆర్ ప్రకటించిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను రేవంత్ సర్కార్ అటకెక్కించింది. జిల్లాలోని రైతులకు పూర్తిస్థాయిలో రైతుబంధు, పంట రుణమాఫీ అమలు చేయలేదు. కొత్త రేషన్‌కార్డులు, పింఛన్ల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నా ప్రభుత్వ పట్టించుకోవడం లేదు.

### అభివృద్ధికి నిధులేవి...

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా సంగారెడ్డి జిల్లా అభివృద్ధికి నిధులు విడుదల కాలేదు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి చేపట్టాల్సి ఉంది. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ సంగారెడ్డి జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, 600కు పైగా పంచాయతీలకు ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారు. సంగారెడ్డి మున్సిపాలిటీకి రూ.50 కోట్లు మంజూరు చేశారు. అందోలు, జహీరాబాద్, సదాశివపేట, నారాయణఖేడ్, అమీన్‌పూర్, తెల్లాపూర్, ఆర్‌సీపురం మున్సిపాలిటీలకు రూ.25కోట్ల చొప్పున ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేశారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని 600కుపైగా పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధులు నిలిపివేసింది. ఆ నిధులు వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో సమీకృత వెజ్,నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. పటాన్‌చెరులో కార్మికుల కోసం కేసీఆర్ సర్కార్ 250 పడకల దవాఖాన నిర్మాణం ప్రారంభించింది. 90శాతం పనులు పూర్తయ్యాయి.



మిగతా 10శాతం పనుల పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. పాశమైలారం పారిశ్రామికవాడ నుంచి కర్ధనూరు వరకు కేసీఆర్ ప్రభుత్వం రెండు వరుసల రహదారి నిర్మాణం చేపట్టింది. ప్రభుత్వం మరి కొన్ని నిధులు విడుదల చేస్తే రోడ్డు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పటాన్‌చెరుకు కేసీఆర్ సర్కారు ఆర్డీవో కార్యాలయం, రిజిస్ట్రేషన్ కార్యాలయం మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు కార్యాలయాలను ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ సర్కార్ మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రోరైలు విస్తరిస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో రైలు విస్తరణ పనులు పట్టించుకోవడం లేదు. సంగారెడ్డి నియోజకవర్గం ఉర్దూ రెసిడెన్సియల్ కళాశాల, పాఠశాలల భవన నిర్మాణ పనులకు రూ.10 కోట్ల నిధులు అవసరం. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నిధులు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సంగారెడ్డి నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి రూ.100 కోట్ల వరకు నిధులు అవసరం ఉంది. మెట్రోరైలును సంగారెడ్డి వరకు పొడిగించాలని, సంగారెడ్డిలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అందోలు నియోజకవర్గంలోని అల్లాదుర్గం–మెటల్‌కుంట రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

### జహీరాబాద్‌కు వరాలు కురిపించేనా..

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఇకనైనా తమ సమస్యలు పరిష్కారమవుతాయా అని ఎదురుచూస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.100 కోట్లకు పైగా నిధులు అవసరం ఉన్నాయి. జహీరాబాద్–బీదర్ రహదారి విస్తరణ చేపట్టాలని డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కొత్తూరు సమీపంలోని నారింజ ప్రాజెక్టు జలాలు వృథాగా దిగువకు పోతున్నాయి. ఈ ప్రాజెక్టు జలాలు తమకు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జహీరాబాద్ రైతులకు కోరుతున్నారు. కొత్తూరులోని చెరుకు పరిశ్రమ ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చెరుకు రైతులు డిమాండ్ చేస్తున్నారు. మీర్జాపూర్ పీజీ కళాశాలలో కొత్తకోర్సులు ప్రారంభించాలని, జహీరాబాద్ సమీపంలోని హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు.

### రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం

కాంగ్రెస్ పాలనలో సంగారెడ్డి జిల్లా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వందశాతం పంట రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. కానీ, జిల్లాలో 30 శాతం మందికిపైగా రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని 50 శాతం రైతులకు మాత్రమే రైతుభరోసా డబ్బులు జమయ్యాయి. రైతుభరోసా డబ్బులను వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎరువుల కొరత, నకిలీ విత్తనాల కొరతను రైతులు ఎదుర్కొంటున్నారు.

### అటకెక్కిన సంగమేశ్వర,బసవేశ్వర ఎత్తిపోతలు

సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో అప్పటి సీఎం కేసీఆర్ సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. గోదావరి జలాలను మంజీరాలో కలిపి, ఆ నీటిని సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ద్వారా జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లోని రైతులకు సాగునీరు అందించేందుకు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కేసీఆర్‌కు క్రెడిట్ దక్కవద్దన్న కుయుక్తితో రేవంత్ సర్కార్ సంగమేశ్వర,బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులు నిలిపివేసింది. జహీరాబాద్, అందోలు, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని 11 మండలాల పరిధిలో ఉన్న 231 గ్రామాల్లోని 2.19 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా రూ.2653 కోట్లతో సంగమేశ్వర ఎత్తిపోతల పనులను కేసీఆర్ ప్రారంభించారు. చిన్నచల్మెడలలో పంప్‌హౌస్ పనులు మొదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సంగమేశ్వర ఎత్తిపోతల పథకం పనులు ఆపింది. నారాయణఖేడ్, అందోలు నియోజవర్గాల్లో 1.71 లక్షల ఎకరాకు సాగునీరు అందించేలా కేసీఆర్ సర్కార్ రూ.1774 కోట్లతో బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి నిధులు ఇవ్వడం లేదు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో సింగూరు బ్యాక్‌వాటర్ నుంచి నల్లవాగు ప్రాజెక్టుకు మంజీరా జలాలు తరలించేందుకు రూ.100కోట్లతో పథకానికి బీఆర్‌ఎస్ సర్కారు ప్రతిపాదించింది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు కాల్వల లైనింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనుల నాణ్యతతో వేగంగా పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. మరమ్మతుల పేరుతో రైతులు ఇప్పటికే రెండు పంటలు సాగుచేయలేక నష్టపోయారు.

## గజ్వేల్‌లో తడిసిన ధాన్యం


ముత్రాజ్‌పల్లి రింగ్‌రోడ్డుపై వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

గజ్వేల్, మే 22: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని ఆయా గ్రామాల్లో భారీగా కురిసిన వర్షానికి ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిముద్దయ్యింది. రైతులు రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యం కొట్టుకు పోవడంతో రైతులు దిగులుపడుతున్నారు. బుధవారం కురిసిన అకాల వర్షంతో ఈఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయారు. శ్రీగిరిపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవడంతో రైతులు ఆరబెడుతున్నారు. ముత్రాజ్‌పల్లి రింగ్‌రోడ్డుపై రైతులు ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది.

### నెత్తిమీదికి కాలం వచ్చినా వడ్లు పోలే..



మిరుదొడ్డి, మే 22: వడ్లు వర్షాలకు తడిసి పోయాయి. రైతుల గోస ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు. ధాన్యంపై కప్పుకోవడానికి టార్పాలిన్ కవర్లు ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలం నెత్తి మీదికి వచ్చిన వడ్ల కొనుగోళ్లు పూర్తికాక రైతులు శాన తిప్పల పడుతున్నాం. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి.

**-గడ్డం బాల్ నారాయణ, రైతు, మిరుదొడ్డి**

## బీహారు సర్పంచుల బృందం పర్యటన


గూడెంగడ్డ గ్రామంలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న బీహారు సర్పంచ్‌ల బృందం

నర్సాపూర్, మే 22 : మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని గూడెంగడ్డ, నారాయణపూర్ గ్రామాల్లో బీహారులోని గయాజీ జిల్లాకు చెందిన 100 మంది సర్పంచుల బృందం గురువారం పర్యటించింది. నర్సరీలు, డంపింగ్ యార్డు, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనం, ఇంకుడు గుంతలు, స్టీల్ బ్యాంకు, తడిపొడి చెత్త వేరు చేసే విధానం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. బీహారులో పెన్షన్లు కేవలం రూ.400 మాత్రమే ఇస్తున్నారని, తెలంగాణలో రూ.2 వేల వరకు ఇవ్వడం, దివ్యాంగులకు రూ.4 వేలు ఇవ్వడాన్ని మెచ్చుకున్నారు. బృందం వెంట డీఎల్పీవో సాయిబాబా, ఎంపీడీవో మధులత, ఏపీఎం గౌరీశంకర్, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు మల్లేశం, లక్ష్మణ్, వంశీకృష్ణ, నగేశ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీఏలు తదితరులు పాల్గొన్నారు.

## వానలకు ముక్కిపోయి మొలకెత్తిన ధాన్యం

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- బురదగా మారిన కొనుగోలు కేంద్రాలు
- శివంపేట సొసైటీలో దుర్వాసన
- అకాల వర్షంతో రైతన్నకు తిప్పలు


శివంపేట సొసైటీలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు


చౌటకూర్‌లో తడిసి ముద్దకట్టి ముక్కిపోయిన ధాన్యం


బురదమయంగా మారిన శివంపేట సొసైటీ

చౌటకూర్, మే 22: యాసంగి ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యింది. యాసంగి సీజన్‌కు ఎంత ధాన్యం దిగుబడి వస్తుందో ఏమాత్రం అంచనాలు లేకపోవడంతో కొనుగోళ్ల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కొట్టొచ్చినట్లు స్పష్టమవుతున్నది. వారం క్రితం కురిసిన అకాల వర్షం నుంచి తేరుకునే లోపే మళ్లీ బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ఇప్పటికే తడిసిన ధాన్యంతో సతమతమవుతున్న రైతన్న నెత్తిన పిడుగు పడినట్లయ్యింది. సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలంలో దాదాపు ప్రతి గ్రామంలో పీఏసీఎస్, ఐకేపీ, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అలసత్వం కారణంగా రైతుల ధాన్యం వర్షాలకు తడిసి ముద్దవుతున్నది. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు కరువయ్యాయి. రైతులకు టార్పాలిన్లు సైతం అందజేయకపోవడంతో ఆరబెట్టిన ధాన్యంతో పాటు కాంటా చేసిన బస్తాలు వర్షానికి తడుస్తున్నాయి. ఏ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఇదే పరిస్థితి నెలకొన్నది. ఆరబెట్టిన ధాన్యాన్ని కాంటా వేసేందుకు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే అక్కడ కాంటా చేసిన బస్తాలను రైస్ మిల్లులు, ఇతర గోదాములకు తరలించేందుకు అవసరమైన లారీలు సమయానికి రాకపోవడంతో రోజుల తరబడి నిరీక్షిస్తున్నారు. దీంతో వర్షాలకు ధాన్యమంతా తడిసి ముక్కిపోయి మొలకెత్తుతున్నాయి. శివంపేట సొసైటీలో సరైన సౌకర్యాలను సమకూర్చడంలో కేంద్రం నిర్వాహకులు విఫలం కావడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా ఎండిన ధాన్యాన్ని తీసుకువస్తే కనీసం కాంటా చేసే వారు దిక్కులేకుండా పోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంటా చేసిన ధాన్యం బస్తాలనైనా గోదాములకు తరలించేందుకు లారీలు వస్తాయనుకుంటే, వారానికి ఒక లారీని పంపిస్తే ఎలా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తడిసిన ధాన్యం ముద్దలుగా మారి ముక్కిపోయి మొలకలు వస్తుండడంతో మద్ధతు ధర వస్తుందో రాదోనన్న బెంగ రైతులను వెంటాడుతున్నది. ఇంతా జరుగుతున్నప్పటికీ, అధికారులు నిద్రపోతున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి, ఎమ్మెల్యేలు కనీసం ధాన్యం సేకరణపై సమీక్షలు నిర్వహించిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి అన్ని కొనుగోలు కేంద్రాలకు వెంటవెంటనే లారీలు పంపించి ధాన్యం బస్తాలను తరలించాలని రైతులు కోరుతున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ గురువారం శివంపేట సొసైటీలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన శివంపేటలోని శ్రీసాయి వీరభద్ర రైస్‌మిల్లును సందర్శించారు. లారీలు ఏమైనా అందుబాటులో ఉన్నాయా అంటూ ఆరా తీసి బస్తాలు ఆన్‌లోడ్ చేసిన లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## సిద్దిపేట మార్కెట్‌లో రైతులకు గోస


సిద్దిపేట మార్కెట్ యార్డులో వర్షానికి తడిసిన వడ్లు

సిద్దిపేట కమాన్, మే 22 : రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన వడ్లు వానలకు తడుస్తుండడంతో ఆవేదన చెందుతున్నారు. సిద్దిపేట మార్కెట్‌లో పోసిన ధాన్యం వర్షపు నీటికి కొట్టుకుపోవడంతో రైతులు కలత చెందారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షానికి సిద్దిపేట మార్కెట్ యార్డులో పలువురు రైతుల ధాన్యం తడిసిపోయింది. జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ వర్షం నీరు అధికంగా రావడంతో కొందరి రైతుల వడ్లు కొట్టుకుపోయాయి. వెంటవెంటనే కొనుగోళ్లు జరుపుతూ తరలించాలని కోరుతున్నారు.

### వడ్లన్నీ తడిసినయి..



నాలుగు ట్రాక్టర్ల వడ్లు తెచ్చి ఆదివారం బీట్ల పోసిన. అప్పటి నుంచి నేర్పి ఎండబెట్టిన. సమయానికి అధికారులు వచ్చి మాశ్చర్ చూస్తే మంచిగుండేది. ఇంతలోనే వాన మొదలైంది. ఎండిన వడ్లన్నీ తడిసి పోయినయి. మరిన్ని వర్షానికి కొట్టుకుపోయినయి. ఆరుగాలం పండించిన వడ్లు మార్కెట్ల పడ్డంక తడసే వరకు చానా బాధ అయితంది.

**– లక్ష్మారెడ్డి , రైతు, ఎన్సాన్‌పల్లి**

### చేతికొచ్చినంక నీళ్ల పాలైనయి..



మార్కెట్లో అధికారులు పట్టించుకుంటలేరు. ఇప్పుడు వానొచ్చి వడ్లు వరదల కొట్టుకుపోయాయి. మాశ్చర్ చూస్తే వడ్లు కొనుగోళ్లు అయిపోయేవి. బతిమిలాడినా చూడలేదు. మార్కెట్లకు వడ్లు తెచ్చిన రైతులకు చాలా ఇబ్బంది అవుతున్నది. ఎండిన వడ్లు తడిసిపోయే.. మళ్లీ ఆరబెడుతున్నం. చేతికొచ్చిన పంట నీళ్ల పాలైంది.

**– కంది తిరుమల, రైతు, ఎన్సాన్‌పల్లి**

### డబుల్ పని అయ్యింది..

వడ్లు తెచ్చి సిద్దిపేట మార్కెట్‌లో పోశా. బుధవారం అధికారులు బార్‌దాన్ ఇచ్చి ఉంటే వడ్లు తూకం అయ్యేవి. సమయానికి అధికారులు బార్‌దాన్ ఇవ్వకపోవడంతో వడ్లు కాంటా కాలేదు. వడ్లన్నీ ఎండినయి. తీరా వాన మొదలైంది. ఇక్కడే ఉంటే ఎండిన వడ్లు మళ్లీ తడుస్తాయని భయమవుతుంది. అధికారులు కొంటరా కొనరా తెలుస్తలేదు. ఎందుకైనా మంచిదని మార్కెట్ల పోసిన వడ్లను కుటుంబమంతా కలిసి మళ్లీ ట్రాక్టర్‌లో ఎత్తి షెడ్ల కిందకు తరలిస్తున్నా.మాకు డబుల్ పని, డబుల్ ఖర్చు అవుతున్నది.

**– ఆవుల మల్లయ్య,రైతు, నర్సపురం**